క్లుప్తంగా

పరామర్శ



సుశీలమ్మ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి

తిరుపతి రూరల్(రామచంద్రాపురం) : రామచంద్రాపురం మండలం నడవలూరులో ఆదివారం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి పర్యటించారు. వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులైన ఆరిపల్లి వెంకటరమణారెడ్డి, ఆరపల్లి మధుసూదన్‌రెడ్డి, ఆరిపల్లి హరనాథరెడ్డి తల్లి ఆరిపల్లి సుశీలమ్మ గత రెండు రోజుల క్రితం ఆకస్మికంగా మరణించడంతో ఆ కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట సర్పంచ్ గణపతిరెడ్డి, యోగానందరెడ్డి ఉన్నారు.

తిరుపతిలో కుండపోత వర్షం

తిరుపతి తుడా: తిరుపతిలో ఆదివారం సాయంత్రం కురిసిన కుండపోత వర్షానికి నగరం తడిసి ముద్దయింది. సుమారు 40 నిమిషాలకు పైగా జోరు వాన పడింది. ఎలాంటి ఉరుములు, మెరుపులు, గాలి లేకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. వర్షం ధాటికి నగరంలోని మురుగు కాలువలు పొంగి రోడ్లపై ప్రవహించాయి. వర్షపు నీరు ఏరులై పారింది. రోడ్లపై మురుగునీటి ప్రవాహంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా ఫిష్ మార్కెట్ సమీపంలో మోకాలి లోతు నీళ్లు చేరాయి. లక్ష్మీపురం కూడలి, తిలక్ రోడ్డు, కొర్లగుంట, కొరమేను గుంట, మాధవ నగర్, మధురానగర్, చంద్రశేఖర రెడ్డి కాలనీ, కూరగాయల మార్కెట్ తదితర ప్రాంతాల్లో వర్షపు నీరు ప్రవహించింది.

ఘనంగా ఎస్‌బీబీ వార్షికోత్సవం



మాట్లాడుతున్న కేవీ చౌదరి

తిరుపతి కల్చరల్: శ్రీబాలాజీ బ్రిక్స్ ఇండస్ట్రీస్ సంస్థ 40వ వార్షికోత్సవం సందర్భంగా వినియోగదారులకు బంపర్ ఆఫర్ ఇస్తున్నామని సంస్థ అధినేత కేవీ చౌదరి తెలిపారు. ఆదివారం ఓ ప్రైవేటు హోటల్లో ఎస్‌బీబీ 40వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రూ.12 ధర కలిగిన ఇటుకను కేవలం రూ.8కే అందించడం జరుగుతుందన్నారు. తమ ఇటుకల ఫ్యాక్టరీ వద్ద కొనుగోలు చేసిన వారికి ఈ ఆఫర్ ఉంటుందని, ఈ ఆఫర్ ఈనెల 31వ తేది రాత్రి 8 గంటల వరకు ఉంటుందన్నారు. ఇటుకరాళ్లు కావాల్సిన వారు అడ్వాన్సు డబ్బులు చెల్లించి రసీదు పొంది తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌బీబీ ప్రతినిధులు, ఇతర వ్యాపారులు పాల్గొన్నారు.

ఆహార అలవాట్ల మార్పుతో మంచి ఆరోగ్యం



సమావేశంలో మాట్లాడుతున్న డైటిస్ట్ సునీత

తిరుపతి కల్చరల్: నేటి ఆధునిక జీవన శైలిలో ఆహారపు అలవాట్లు మార్పు చేసుకుని నిత్యం అనుసరించడం ద్వారా ఆరోగ్యవంత జీవనం సాగించవచ్చని ప్రముఖ డైటిస్ట్ సునీత తెలిపారు. గోవిందరాజ వాకర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఆదివారం ఎస్‌జీఎస్ కళాశాల ఆవరణలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె నేటి ఆధునిక సమాజంలో తీసుకోవాల్సిన ఆహారం గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వాకర్స్ అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. గతంలో అసోసియేషన్ అధ్యక్షుడిగా వాకర్స్‌కు విశేష సేవలు అందించడంతో పాటు వాకర్స్ ఇంటర్నేషనల్ ద్వారా అవార్డు అందుకున్న రెడ్డివారిప్రభాకర్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు రఘురామారెడ్డి, గౌరవాధ్యక్షుడు పీసీ రాయులు, నాయకులు విజయభాస్కర్‌రెడ్డి, కృష్ణమూర్తి, డాక్టర్ వీఎస్ఆర్ ఆంజనేయులు, సభ్యులు పాల్గొన్నారు.

దళిత విద్యార్థిపై దాడి హేయమైన చర్య

తిరుపతి కల్చరల్: విద్యానికేతన్ ఇంజినీరింగ్ కళాశాలలో ఫైనల్ ఇయర్ చదువుతున్న జేమ్స్‌ను చంపేందుకు ప్రయత్నించడం దారుణమైన చర్య అని, ఈ దుర్మార్గానికి పాల్పడిన రౌడీషీటర్ సాయి రూపేష్, చోటా బ్లేడ్ గ్యాంగ్‌లపై కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. హత్యాయత్నానికి పాల్పడిన వారిపై తిరుచానూరు పోలీసులు నామమాత్రపు కేసు నమోదు చేయడం విడ్డూరమన్నారు. కులం పేరుతో దూషించి చంపేందుకు కుట్ర చేసిన వారిపై హత్యాయత్నం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. జేమ్స్‌కు న్యాయం జరిగే వరకు చేసే పోరాటంలో సీపీఎం ప్రత్యక్షంగా పాల్గొంటుందన్నారు.

లోఓల్టేజీ భయం..



రుయాలో ప్రస్తుతం ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు

రాయలసీమలోనే పేదల పెద్దాస్పత్రి రుయాలో లోఓల్టేజీ సమస్య కలవరపెడుతోంది. వేసవి కాలం మొదలైనప్పటి నుంచి ఈ సమస్య అధికమైంది. విద్యుత్ వినియోగం పెరగడంతో తరచూ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు భగ్గుమంటున్నాయి. దీంతో విద్యుత్ సరఫరాకు తరచూ ఆటంకం ఏర్పడుతోంది. ఉన్నతాధికారులు స్పందించి ఆస్పత్రికి విద్యుత్ అంతరాయం కలుగకుండా చూడాల్సిన అవసరం ఉంది.

- వేసవి కావడంతో పెరిగిన విద్యుత్ వినియోగం
- మెడికల్ కళాశాల, రుయా ఆస్పత్రిలో లోఓల్టేజీ సమస్య
- భయపడుతున్న రోగులు
- మరో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు ఆదేశాలు

తిరుపతి తుడా: వేసవి మొదలవడంతో అంతటా విద్యుత్ వినియోగం భారీగా పెరిగి సరఫరాలో తరచూ అంతరాయం కలుగుతోంది. అందులో భాగంగా రుయా, మెడికల్ కళాశాల, చిన్నపిల్లల ఆస్పత్రి, వైద్య విద్యార్థుల వసతి సముదాయాల్లో కూడా విద్యుత్ వాడకం పెరిగింది. అలానే ఏసీల వినియోగం అధికం కావడంతో లోవోల్టేజీ సమస్య మరింత భయపెడుతోంది. తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. సామర్థ్యానికి సరిపడా విద్యుత్ సరఫరా లేకపోవడంతో ఏసీలు, వెంటిలేటర్ల వినియోగానికి తీవ్ర ప్రమాదకరంగా మారింది. నెల క్రితం ఓ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పేలిపోవడంతో ఆస్పత్రిలో గందరగోళం నెలకొంది. సకాలంలో జనరేటర్ అందుబాటులో లేకపోవడంతో రోగుల ప్రాణాలపైకి వచ్చింది. ప్రస్తుతం ఇక్కడ విద్యుత్ వినియోగం 1500 కేవీలకు పైగా అవసరం అవుతోంది. ఆ మేరకు ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం అందుబాటులోకి లేకపోవడంతో తరచూ విద్యుత్ సమస్య ఎదురవుతోంది.

పేరుకే నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లు

రుయా పరిధిలో మొత్తం నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. ఇటీవల వరకు రెండు మరమ్మతులకు గురైనా సంబంధిత అధికారులు పట్టించుకోలేదు. ఈ క్రమంలో నెల క్రితం లోవోల్టేజీ కారణంగా ఓ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పేలిపోవడంతో అధికారులు మరో ట్రాన్స్‌ఫార్మర్ ద్వారా సరఫరా ఇచ్చారు. ఇంతలో ఆ ట్రాన్స్‌ఫార్మర్ కూడా మరమ్మతులకు గురవడంతో ఒక రోజంతా రుయాలో గందరగోళం నెలకొంది. జనరేటర్ల ద్వారా విద్యుత్ సరఫరా అందించడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రస్తుతం రుయాలో మూడు 500 కేవీలు, ఒక 350 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. విద్యుత్ సరఫరాకు ఆటంకం ఏర్పడితే ప్రత్యామ్నాయంగా రెండు జనరేటర్లు అందుబాటులో ఉన్నాయి. అయితే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు నాలుగు ఉన్నా ప్రస్తుతం మూడింటి నుంచి మాత్రమే విద్యుత్ సరఫరాను అందిస్తుండడంతో మెడికల్ కళాశాల, రుయా ఆసుపత్రికి ఓల్టేజీ సమస్య తరచూ ఎదురవుతోంది. వేసవి కావడంతో వినియోగం సాధారణంగానే విద్యుత్ వినియోగం పెరగడంతో మరో ట్రాన్స్‌ఫార్మర్ కూడా అవసరమని రుయా అధికారులు గుర్తించారు. ఇదే విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం సంబంధిత శాఖ అధికారులు మరో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.

నోటీస్ బోర్డు

- భవానీ నగర్‌లోని రోటరీ క్లబ్‌లో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు మెగా ఆక్యుప్రెజర్
- మున్సిపల్ కార్యాలయంలో ఉదయం 9 నుంచి 1 గంట వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక, ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం
- మంగళం ఆర్టీఓ కార్యాలయం ఎదురుగా సహస్ర హాస్పిటల్లో ఉదయం 9 నుంచి రాత్రి 7 గంటల వరకు రక్తపోటు ఉచిత వైద్యశిబిరం
- జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

మురుగు నీటితో అవస్థలు

రేణిగుంట: రెండు రోజులుగా రేణిగుంటలో పడుతున్న వర్షాల కారణంగా మురుగునీరు వర్షపునీటితో కలసి రోడ్లపైకి వస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రేణిగుంట రైల్వే స్టేషన్ ప్రాంగణంలో మురుగునీరు నిలిచింది. శని, ఆదివారాల్లో కురిసిన వర్షానికి మురుగు కాలవలు పొంగిప్రవహించాయి. తిరుపతి రేణిగుంట ఫ్లైఓవర్ మొదట్లో నీళ్లు నిలిచిపోవడంతో వాహన రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ఓల్డ్ చెక్ పోస్ట్‌లో మురుగు నీరు కలిసిన వర్షపు నీరు రోడ్డుపై ఉండడంతో ద్విచక్ర వాహనాలు వెళ్లడానికి వీలులేని పరిస్థితులు నెలకొన్నాయి. కనీస ముందస్తు చర్యలు తీసుకోకుండా పంచాయతీ అధికారులు కాలయాపన చేస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు.

మన సనాతన ధర్మం ప్రపంచానికే ఆదర్శం



తల్లిదండ్రులకు పాద పూజ చేస్తున్న విద్యార్థులు



మాట్లాడుతున్న స్విమ్స్ డైరెక్టర్ ఆర్‌వీ కుమార్

తిరుపతి కల్చరల్: మన దేశ ప్రాచీన, సనాతన ధర్మాలను నేడు ప్రపంచం అంతా అనుసరిస్తోందని స్విమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఆర్‌వీ కుమార్ తెలిపారు. రామకృష్ణ మిషన్ ఆశ్రమంలో గత నెల రోజులు చేపట్టిన సంస్కార శిబిరం ఆదివారం ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా ఆశ్రమంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. సమష్టి కుటుంబం, ఆలయ వ్యవస్థ కనుమరుగవుతున్న తరుణంలో ఆ బాధ్యతను రామకృష్ణమిషన్ ఆశ్రమం చేపట్టిందని తెలిపారు. కోవిడ్ వ్యాప్తి మానవాళి మనుగడనే ప్రశ్నార్థకం చేయడంతో అనేక మంది భయపడ్డారన్నారు. అయితే మన ప్రాచీన పద్ధతులు, సనాతన ధర్మాలు, భారతదేశాన్ని కోవిడ్ నుంచి సంరక్షించాయని తెలిపారు. పిల్లలను బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దడం, దేశాభివృద్ధికి పాటు పడేలా చేయడం తల్లిదండ్రుల బాధ్యత అని తెలిపారు. పిల్లల్లో పోటీతత్వం ఉండరాదని, తనలోనే ఆనందం పొందే గుణం కలిగి ఉండాలని తెలిపారు. విద్యార్థుల్లో సంస్కరణలు తల్లిదండ్రుల ద్వారా సంక్రమించాలని సూచించారు. అనంతరం ఎస్వీ ఆయుర్వేదిక్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.మురళీకృష్ణ, రామకృష్ణ మిషన్ ఆశ్రమం కార్యదర్శి స్వామి సుకృతానంద ఉపన్యసించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ తల్లిదండ్రుల పాదాలను కడిగి, వేదమంత్రాలు పఠిస్తూ పూజలు చేశారు. కార్యక్రమంలో ఆశ్రమ సహాయ కార్యదర్శి స్వామి సత్యస్థానంద, సుధాకర్‌రెడ్డి, వలంటీర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల భారం.. దారుణం



సింహాల మోహన్

భాకరాపేట : ట్రూఅప్ చార్జీలు, సర్దుబాటు చార్జీలు, స్మార్ట్ మీటర్లు అంటూ ప్రజలపై విద్యుత్ భారాలు మోపడానికి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం చేపడతామని చిన్న గొట్టిగల్లు మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింహాల మోహన్ అన్నారు. ఆదివారం ఆయన చిన్నగొట్టిగల్లులో స్థానిక విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని, 11 నెలల కూటమి పాలనలో ప్రజా వ్యతిరేక విధానాలనే అమలు చేస్తోందన్నారు. విద్యుత్ చార్జీలు తగ్గించకపోగా అధికారంలోకి వచ్చిన 11 నెలల్లోనే రెండు విడతలుగా ప్రజలపై రూ.15485 కోట్ల భారం వేసిందన్నారు. అంతేకాకుండా 2024–2025 సంవత్సరానికి సంబంధించిన సర్దుబాటు చార్జీల ప్రతిపాదనను సిద్ధం చేసిందని, దీని వల్ల రానున్న కాలంలో దాదాపు రూ.1.10 లక్షల కోట్లు భారం ప్రజలపై పడనుందన్నారు. రానున్న రోజుల్లో విద్యుత్ చార్జీల భారాన్ని నిరసిస్తూ ప్రజా ఉద్యమాన్ని నిర్మిస్తామన్నారు.

ఎస్వీయూ వీసీగా బీసీకి అవకాశం ఇవ్వాలి



ఎస్వీయూ వీసీగా బీసీ ప్రొఫెసర్‌కు ఇవ్వాలని ఐక్యత చాటుతున్న బీసీ నేతలు

తిరుపతి కల్చరల్: ఎస్వీ యూనివర్సిటీకి రెగ్యులర్ వీసీగా అర్హులైన బీసీ ప్రొఫెసర్లనే నియమించాలని ఆంధ్రప్రదేశ్ బీసీ కులాల సమన్వయ కమిటీ నేతలు డిమాండ్ చేశారు. ఈమేరకు ఆదివారం ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్లో ఆంధ్రప్రదేశ్ బీసీ కులాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో వివిధ బీసీ కుల సంఘాల నేతల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ కులాల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ నారాయణస్వామి గౌడ్ మాట్లాడుతూ 70 ఏళ్ల చరిత్ర కలిగిన ఎస్వీయూ వీసీగా తెలుగుదేశం పాలనలో ఇప్పటి వరకు బీసీ ప్రొఫెసర్లకు ఇవ్వలేదని, కనీసం ఈసారైనా ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీ సంఘర్షణ సమితి అధ్యక్షుడు అక్కినపల్లి లక్ష్మయ్య, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నారాయణ గౌడ్ మాట్లాడుతూ ఈనెల 20వ తేదీ అమరావతిలో యూనివర్సిటీ సెర్చ్ కమిటీ సమావేశమవుతున్న సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఎస్వీయూ వీసీగా అర్హులైన బీసీ ప్రొఫెసర్లను నియమించి బీసీలకు వెన్నుదన్నుగా నిలవాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు తురక అమర్నాథ్, నాయీ బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు బుజ్జిబాబు, బీసీ సంఘర్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బుసగాని లక్ష్మయ్య, జంగం సంఘం జిల్లా అధ్యక్షుడు భరత్, పలు సంఘాల నేతలు పాల్గొన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

తిరుపతి తుడా: వేసవి ఉష్ణోగ్రతల దృష్ట్యా సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక, 9.30 నుంచి 10.30 గంటల వరకు నిర్వహించే డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలో ఫోన్ ద్వారా ఫిర్యాదులు చేయాలనుకుంటే 0877–2227208 నంబరుకు కాల్ చేసి చెప్పవచ్చన్నారు. ఈ కార్యక్రమాలను నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శన



నృత్యప్రదర్శనలతో ఆకట్టుకుంటున్న కళాకారులు

చంద్రగిరి: తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. వారాంతపు కార్యక్రమంలో భాగంగా ఆదివారం బెంగళూరుకు చెందిన దివ్యశ్రీ మ్యూజిక్, డ్యాన్స్, నాట్యాచార్యులు దివ్య సతీష్ ఆధ్వర్యంలో శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించారు. ఇందులో భాగంగా పుష్పాంజలి, అలరిప్పు, కీర్తనం, స్వరావళి, దేవరణమ, శబ్దం, వర్ణం, నాగస్తుతి, మూకాంబిక, అష్టకం, మంగళం వంటి పాటలకు కళాకారులు చూడచక్కని హావభావాలతో నాట్య ప్రదర్శన చేశారు. వారి అభినయానికి మంత్రముగ్ధులైన ప్రేక్షకులు కరతాళధ్వనులతో అభినందనలు తెలిపారు. అనంతరం ఏఓ సుధాకర్ కళాకారులను సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు.

హెచ్ఐవీతో మరణించిన అభాగ్యులకు నివాళి



కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టిన అధికారులు, స్వచ్ఛంద సేవా సంస్థలు

తిరుపతి తుడా: జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో ప్రపంచవ్యాప్తంగా హెచ్ఐవీ బారిన పడి మరణించిన 38 మిలియన్ ప్రజలకు ఆదివారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బాలకృష్ణ నాయక్ మాట్లాడుతూ అంతర్జాతీయ ఎయిడ్స్ దీప స్మృత్యంజలి దినోత్సవం సందర్భంగా 1983 నుంచి నేటి వరకు ఎయిడ్స్‌తో మరణించిన అభాగ్యులను స్మరించుకుంటూ వారి ఆత్మకు శాంతి కలగాలని వారి కుటుంబ సభ్యులకు దేవుడు మనో ధైర్యం ప్రసాదించాలని కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టామన్నారు. అదనపు జిల్లా వైద్య ఆరోగ్య అధికారి ఎయిడ్స్ విభాగం డాక్టర్ మురళి, దిశా క్లస్టర్ ప్రాజెక్ట్ మేనేజర్ కోటిరెడ్డి, అకౌంటెంట్ పుల్లయ్య, ఇతర ప్రభుత్వ అధికారులు, నర్సింగ్ విద్యార్థినులు, ఐసీటీసీ, ఏఆర్‌టీ, విహాన్, పాస్, ఎల్‌డబ్ల్యూఎస్, గ్రాసం స్వచ్ఛంద సేవాసంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

స్వర్ణరథంపై కల్యాణ వెంకన్న కటాక్షం



స్వర్ణరథంపై దర్శనమిస్తున్న స్వామి, అమ్మవార్లు



స్వర్ణరథంపై మాడవీధుల్లో విహరిస్తున్న స్వామి, అమ్మవార్లు

చంద్రగిరి: శ్రీనివాస మంగాపురంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి వార్షిక వసంతోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం స్వామివారి స్వర్ణ రథోత్సవం కనుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని రథాన్ని లాగారు. ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి, తోమాల, కొలువు, పంచాంగ శ్రవణం, సహస్రనామార్చన నిర్వహించారు. అనంతరం శ్రీవారి ఉత్సవర్లను వసంత మండపానికి వేంచేపు చేసి ఆస్థానం చేపట్టారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు స్నపన తిరుమంజనం వేడుకగా జరిగింది. అనంతరం సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారు స్వర్ణ రథంపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ స్పెషల్ గ్రేడ్ డెప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఈఈ జగన్‌మోహన్ రెడ్డి, డిప్యూటీ ఈఓ దామోదరం, ఏఈఓ గోపీనాథ్, సూపరింటెండెంట్ రమేష్ బాబు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు, ఇంజినీరింగ్ అధికారులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

అలరించిన దుర్యోధన వధ

- భారీగా తరలివచ్చిన ప్రేక్షకులు
- విశేషాలంకరణలో ద్రౌపదీదేవి దర్శనం



దుర్యోధన వధ ఘట్టాన్ని వీక్షిస్తున్న ప్రేక్షకులు



యుద్ధభూమిలో తలపడుతున్న భీమ, దుర్యోధనులు

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు మండలం యడమవారిపల్లె 74వ మహాభారత ఉత్సవాల్లో చివరి ఘట్టం దుర్యోధన వధ అలరింపజేసింది. ఆదివారం సాయంత్రం జరిగిన ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు భారీగా విచ్చేశారు. కౌరవులు అంతా యుద్ధంలో చనిపోయిన తరువాత దుర్యోధనుడు నీటి మడుగులోకి చేరుకుంటాడు. భీముడు నీటి మడుగు వద్దకు వెళ్లి దుర్యోధనున్ని బయటకు రప్పించి చేసే యుద్ధ సన్నివేశం ప్రేక్షకులను అలరింపచేసింది. యుద్ధ సన్నివేశంలో దుర్యోధనుడు, భీముడి వేషధారుల నటన ఆకట్టుకుంది. యుద్ధ సన్నివేశంలో దుర్యోధనుడు మరణించిన వెంటనే ప్రేక్షకులు పోటీ పడి మట్టి (బంక మట్టి) కోసం జనం ఎగబడ్డారు. అనంతరం ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించగా భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, గ్రామ ప్రజలు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

దారి ఆక్రమణ

ఏర్పేడు: పాపానాయుడుపేటలో పంచాయతీ దారిని ఆక్రమించి ఓ వ్యక్తి అక్రమ నిర్మాణం చేపడుతున్నట్లు స్థానికులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. స్థానిక ధర్మరాజస్వామి ఆలయ సమీపంలో పెన్నగడ్డంకు వెళ్లేమార్గం పంచాయతీ రోడ్డు ఉంది. అయితే ఆలయం పక్కనే మురుగప్ప మొదలి అనే వ్యక్తి దాతల సహాయంతో మరో ఆలయం నిర్మించగా.. ఈ దారిలో ఓ వ్యక్తి 2 సెంట్లు స్థలాన్ని ఆక్రమించి కారు పార్కింగ్ కోసం అక్రమ నిర్మాణం చేపడుతున్నారు. అటువైపు వెళ్లే గ్రామస్తులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, అధికారులు అక్రమ కట్టడాలను కూల్చివేసి కోరుతున్నారు.

మతమార్పిడికి పాల్పడిన వారిపై చర్యలకు డిమాండ్



తొండవాడ ఫ్లైఓవర్ వద్ద హిందూ సంఘాల నేతలను అడ్డుకుని మాట్లాడుతున్న పోలీసులు

చంద్రగిరి: నిబంధనలకు విరుద్ధంగా పేదలకు కేటాయించిన ఇంటి స్థలాల వద్ద అక్రమంగా చర్చి నిర్మించి బలవంతంగా మతమార్పిడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని హిందూ సంఘాలు డిమాండ్ చేశాయి. మండల పరిధిలోని తొండవాడ ఎన్టీఆర్ నగర్(జగనన్న కాలనీ)లో గత మూడు రోజుల క్రితం అక్రమంగా చర్చిని నిర్మించి ప్రార్థనలు చేయడంపై స్థానికులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో రెండు వర్గాల వారికి వాగ్వాదం నెలకొంది. ఈ పంచాయతీ చంద్రగిరి పోలీసు స్టేషన్‌కు చేరుకోవడంతో పోలీసులు సమస్యను రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని తెలిపారు. అయితే ఘటన జరిగి మూడు రోజులైనా పోలీసులు స్పందించకపోవడంతో ఆదివారం విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్, బీజేపీ నేతలు ఎన్టీఆర్ నగర్ (జగనన్న కాలనీ) పేదలకు కేటాయించిన ఇంటి స్థలాన్ని పరిశీలించేందుకు వెళ్లారు. ఈ క్రమంలో తొండవాడ ఫ్లైఓవర్ వద్ద పోలీసులు వారిని అడ్డుకున్నారు. శాంతిభద్రతల కారణంగా అక్కడకు వెళ్లేందుకు అనుమతులు లేవని చెప్పారు. దీంతో హిందూ సంఘాల నేతలు రోడ్డుపైనే నినాదాలు చేశారు. తక్షణమే స్పందించి అక్రమంగా ఏర్పాటు చేసిన చర్చిని సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ సెలవులో ఉన్నారని, మరో రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో వెనుదిరిగారు.

ముగిసిన అన్నమాచార్యుల జయంతి వేడుకలు



సంకీర్తనలను ఆలపిస్తున్న కళాకారులు

తిరుపతి అన్నమయ్యసర్కిల్: తాళ్లపాక అన్నమాచార్యుల 617వ జయంతి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా అన్నమాచార్య కళా మందిరంలో సంగీత సభ, హరికథ కార్యక్రమం నిర్వహించారు. కె.ఉదయభాస్కర్ బృందం సంగీత సభలో అప్పని వరప్రసాది అన్నమయ్య, అదివో .. అల్లదివో.. శ్రీహరి వాసము వంటి కీర్తనలను ఆలపించారు. అన్నమాచార్య ప్రాజెక్టు విశ్రాంత హరికథ భాగవతారిణి జంధ్యాల కృష్ణకుమారి బృందం తాళ్లపాక అన్నమాచార్యుల జీవిత కథను చెప్పారు. ముందుగా ఉదయం కోదండరామ స్వామి వారి ఆస్థానం ఘనంగా జరిగింది. అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు గోష్ఠిగానం నిర్వహించారు. సాయంత్రం అన్నమాచార్య ప్రాజెక్టు విశ్రాంత గాయకులు కె.వి.విశాలక్ష్మీ బృందం నిర్వహించిన సంగీత సభ, సీతాలక్ష్మీ బృందం హరికథా గానం కట్టుకుంది. అన్నమాచార్య ప్రాజెక్టు కోఆర్డినేటర్ డాక్టర్ సి.లత, అసిస్టెంట్లు కృష్ణమూర్తి, కోకిల, భక్తులు పాల్గొన్నారు.